# తెలిసినవాళ్ళు

"రండి"

గల్లా పెట్టె ముందు నుంచి లేచి నిలబడి తలమీది నల్లటోపీ సర్దుకుంటూ షాపులోకి ఆహ్వానించాడు సేట్ సుందర్‌లాల్. తరువాత కారా కిళ్ళీతో గారపట్టిన పళ్ళన్నీ బయటకు పెట్టి నవ్వుతూ రెండు చేతులూ జోడించి నమస్కరించాడు.

ప్రతి నమస్కారం చేసి సీత వంక గర్వంగా చూశాను.

ఈ షాపులో నాకున్న విలువ గమనించినట్లు సీత చిరునవ్వు నవ్వింది.

"లేటెస్ట్ పేషన్ చీరలు మొన్ననే వచ్చాయి. ప్యూర్ సిల్కు... గాజీ సిల్కు... కాశ్మీర్ సిల్కు అన్ని వెరైటీలు అమ్మగార్కి చూపించు. అయ్యగారికి పేంటింగులు కావాలేమో కనుక్కో... అరే, నాథూ నీకు బొత్తిగా బుద్ధి లేదురా! కస్టమర్స్ వస్తే హుషారుగా ఉండాలని తెలీదూ" అంటూ సేల్స్‌మెన్‌ను కసిరి తానే సరాసరి బీరువాల వద్దకు వచ్చి చీరలుతీసి బయట పడెయ్యటం అరంభించేడు సేట్ సుందర్‌లాల్.

"ప్రస్తుతం పేంటింగులు వద్దు. చీరలు మాత్రం చూపించండి" అంటూ సీతవైపు తిరిగి 'సీతా నీకు సిల్కు చీరలు చాలా ఉన్నాయి కదా మంచి కాటన్ చీరలు తీసుకో' అన్నాను. సీత నావంక నిరసనగా చూసింది.

నా పరువు కాపాడమన్నట్లు కళ్ళతోనే అర్థించాను.

"ఫుల్ వాయిల్స్ చూపించండి. లేత రంగులు మాత్రమే కావాలి. గడి లేకుండా చిన్న పువ్వుంటే మరీ మంచిది. 'బార్డరు పెద్దగా ఉండాలి" అంటూ తనకు కావలసిన చీరలు ఎలా ఉండాలో వర్ణించింది మా ఆవిడ.

"అలాగేనండి" అంటూ సిల్కు చీరల్ని ఒక వారకు తోసేసి, ఫుల్‌వాయిల్ చీరలు సుమారు పదిహేను తీసి కౌంటరు మీద పరిచినట్లు పడేశాడు సేల్స్‌మన్.

సీత చీరనూ, బార్డర్‌నూ తడిమి చూస్తూ ఎంపికలో మునిగిపోయింది.

సుందర్‌లాల్ నాతో కబుర్లు చెప్తున్నాడు.

నా ఉద్యోగం గురించి తలా తోకాలేని ప్రశ్నలు వేసి నా సమాధానాలన్నిటికీ నవ్వుతున్నాడు. నేను అమెరికన్ కంపెనీలో పనిచేస్తున్నానని అతనికి తెలుసు. అమెరికన్ కంపెనీలో పనిచేసే వాళ్ళందరూ ఆఫీసర్లే అతని నమ్మకం కాబోలు! నేను ఒక మామూలు గుమస్తానే అని అతనికి తెలీదు. అయినా అతడిస్తున్న గౌరవాన్ని వదులుకోవటం నాకూ ఇష్టం లేదు.

అంతలోనే ఒక కుర్రాడు డ్రింక్స్ తెచ్చాడు.

"తీసుకోండి" అంటూ నాకొకటి, మా శ్రీమతికొకటి అందించాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకు?" అంటూ మొగమాటం ప్రకటిస్తూ సీసా అందుకున్నాను. సీత మాత్రం మారు మాట్లాడకుండా డ్రింక్ తాగి సీసా కుర్రాడికి అందించి చీరల

సెలక్షన్‌లో మునిగిపోయింది.

అయిదు నిమిషాల తరువాత ఒక చీర ఎంపిక చేసింది.

"ఇదెంత?"

"తొంభయి రెండురూపాయలు" అన్నాడు సేల్స్‌మన్.

"అబ్బా, చాలా ఎక్కువే" అంది సీత.

"సీతా, నీకా చీర నచ్చితే తీసుకో. ఖరీదు గురించి ఆలోచించకు. సేట్ మనకు తెలిసినాయనే ఖరీదులు జాగ్రత్తగానే వేస్తారు" అంటూ సేట్ వంక చూసి చిన్నగా నవ్వాను.

"కావాలంటే ఫ్రీగా తీసుకు వెళ్ళండి సార్. మీలాంటి కస్టమర్స్ మాకు ఎలా దొరుకుతారు?" అంటూ పళ్ళన్నీ బయటకు పెట్టి వికృతంగా నవ్వాడు.

"ఇంకేమైనా చీరలు చూపమంటారా?" సెలెక్టు చేసిన చీర మడత పెడుతూ అడిగాడు సేల్స్‌మన్.

"ప్రస్తుతానికి మరేమీ వద్దు. మళ్ళీ పండుగ ముందు వస్తాం" అంటూ సీత ఇంకా చీరలు కావాలంటుందేమోనన్న భయంతో ముందే ఆనకట్టవేశాను.

సేల్సుమన్ చీరను కవరులో ఉంచి పేక్‌చేసి అందించాడు.

జేబులో ఉన్న ఒకే ఒక వంద రూపాయల నోటుని విసురుగా గల్లా పెట్టెమీద పడేశాను. సుందర్‌లాల్ బిల్లురాసి ఎనిమిది రూపాయినోట్లు బిల్లు కలిపి నాకు అందజేశాడు. మేం బయటకు వచ్చేస్తూ ఉంటే సవినయంగా నమస్కరించి "మమ్మల్ని మరచిపోకండి" అన్నాడు.

బయట ఎండ విపరీతంగా ఉంది. మధ్యాహ్నపు సూర్యుడు నెత్తి మాడ్చేస్తున్నాడు.

"దారుణం" అంది సీత నా పక్కగా నడుస్తూ

"ఎండేనా? మహా దారుణంగా ఉంది" అన్నాను చెమట ఒత్తుకుంటూ.

"ఎండకాదు, చీర ఖరీదు! మొన్న మనపక్కింటి కామేశ్వరమ్మగారు ఇదే చీర డెబ్బయి అయిదురూపాయలకు కొన్నారు. పదిహేడురూపాయలు ఎక్కువ వేశాడు. మనకు" అంది సీత ముఖం చిట్లిస్తూ.

"ఛ! ఛ! సుందర్‌లాల్ అలాటివాడు కాదు. పైగా నాకు బాగా తెలిసినవాడే" అన్నాను.

"తెలిసినవాడు కదా అనే మరి మాట్లాడలేకపోయాం" అంది.

"అయినా కామేశ్వరమ్మగారు కొన్న చీర వేరే రకం అయి ఉంటుంది. ఫుల్‌వాయిల్‌లో బోలెడు రకాలుంటాయి." అంటూ చీరల్లోని రకాల గురించీ, తరతమ బేధాల గురించి వర్ణించబోయాను.

"చాల్లెండి. చీరల గురించి మీకే తెలుసు, కట్టుకునేదాన్ని నాకు తెలియదు కాబోలు" అంటూ మరి నన్ను మాట్లాడనీయకుండా చేసేసింది సీత.

"బాబూ, రిక్షా కావాలా?" పిలుపు విని పక్కకు చూశాను.

మొహం మీద నుంచి కారిపోతున్న జిడ్డులాంటి చెమటను పైమీద ఉత్తరీయంతో ఒత్తుకుంటూ ఆయాసంతో రొప్పుతూ అడిగాడు రిక్షావాడు.

వాడి ముఖం నిండా వికృతంగా గుంటలు!!అతడు నాకు తెలిసినవాడే. మేముంటున్న కాలనీ వెనుకే గుడిసెలో ఉంటున్నాడు.

"బాబూ ఇంటికేనా? ఎక్కండి తీసుకుపోతాను" అన్నాడు.

"సీతా రిక్షా మీద వెళ్ళిపోదాం, ఎక్కు" అన్నాను.

"తీరా రిక్షా దిగాక అల్లరి పెడతాడేమో! మూడో, నాలుగో ఇమ్మంటే కష్టం. రెండురూపాయలకు బేరం అడండి" మెల్లగా రహస్యం చెబుతున్నట్లు అంది సీత.

"ఫర్వాలేదు ఈ రిక్షావాడు తెలిసినవాడే. మనకాలనీ వెనుకే ఉంటున్నాడు" అన్నాను మెల్లగా.

"మీకందరూ తెలిసినవాళ్ళే" అని గొణుగుతూ రిక్షా ఎక్కింది సీత. పక్కనే సర్దుకుని కూర్చున్నాను.

రిక్షావాడు హైరానపడుతూ తొక్కుతున్నాడు. రెండు ఫర్లాంగులు వెళ్లేసరికి వాడి బనీనంతా తడిసిపోయింది. ఆయాసంతో రొప్పటం కూడా స్పష్టంగా వినిపిస్తోంది. వీటికి తోడు పైన నెత్తిని మాడ్చే ఎండ.

సీతతో కబుర్లు చెప్తున్నాను!

చీరలో నష్టపోయిన పదిహేడురూపాయల గురించి గొణుగుతూనే ఉంది సీత.

సుమారు ఇరవై నిముషాలు గడిచాక కాలనీలో మా ఇంటి ముందు రిక్షా ఆగింది.

కిందకు దిగి రిక్షావాడి చేతిలో రూపాయినోటు ఉంచాను.

"బాబూ అయిదుమైళ్ళ దూరానికి రూపాయి డబ్బులా?" ఒగరుస్తూ అడిగేడు.

"ఇంకెవరికయినా అయితే ముప్పావలా ఇస్తాను నువ్వు తెలిసినవాడివి కదా। అని రూపాయిచ్చాను." అంటూ వాడి సమాధానానికి ఎదురుచూడకుండా "పద సీతా" అంటూ ఇంట్లోకి దారి తీశాను.

"తెలిసున్నవారు కదా అని బేరం ఆడకుండా, బాడుగ కట్టడం నాదే పొరపాటు బాబూ!" రిక్షా నడిపించుకుని ముందుకు సాగిపోతూ వాడు గొణుక్కోవటం స్పష్టంగా విన్పించింది నాకు!.

★

(ఆంధ్రప్రభ వీక్లీ అక్టోబరు 1979)